సాక్షి పెద్దపల్లి

శనివారం । 30 । డిసెంబర్ । 2023



అక్షింతల శోభాయాత్ర

పెద్దపల్లిరూరల్: రామజన్మభూమి అక్షింతల శోభాయాత్ర పట్టణంలో శుక్రవారం శోభాయమానంగా సాగింది. మహిళలు మంగళ హారతులతో ఘనంగా స్వాగతం పలికారు.

ఎంపీ టికెట్ కోసం దరఖాస్తు

మంథని: పెద్దపలి ఎంపీ టికెట్ కోసం బీజేపీ పట్టణ అధ్యక్షుడు బూడిద తిరుపతి దరఖాస్తు చేసుకున్నారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో బీజేపీ అగ్రనాయకులను ఆయన కలిశారు. తనకు ఎంపీ టికెట్ ఇవ్వాలని విన్నవించినట్లు తిరుపతి తెలిపారు. ఎంపీ టికెట్ ఈసారి మంథని ప్రాంతానికి కేటాయించాలని అగ్రనాయకులను కోరినట్లు ఆయన వివరించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 29.0/15.8

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొద్దంతా పొడివాతావరణం ఉంటుంది. చలితీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రాజీ మార్గమే ఉత్తమం



జడ్జి హేమంత్‌కుమార్

పెద్దపల్లిరూరల్: జాతీయ లోక్‌అదాలత్‌లో భాగంగా జిల్లా ప్రధాన న్యాయస్థానంలో శనివారం చేపట్టే లోక్‌అదాలత్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి హేమంత్‌కుమార్ కోరారు. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ఇరువర్గాలు రాజీ మార్గాన్ని ఎంచుకుని కేసుల పరిష్కారానికి ముందుకు రావాలని పేర్కొన్నారు. లోక్‌అదాలత్‌లో పరిష్కరించే కేసులపై ఉన్నత న్యాయస్థానాల్లో అప్పీలు చేసుకునే అవకాశం ఉండదని జడ్జి వివరించారు.

ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోండి



దరఖాస్తు పరిశీలిస్తున్న శ్యామ్‌ప్రసాద్‌లాల్

సుల్తానాబాద్‌రూరల్: ప్రజాపాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ సూచించారు. గర్రెపల్లి గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రజాపాలనలో దరఖాస్తులను ఆయన పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. దరఖాస్తుదారుల సందేహాలు నివృత్తి చేశారు. ఆయన వెంట సర్పంచ్ వీరగోని సుజాత, ఎంపీడీవో శశికళ, ఎంపీవో ఫయాజ్‌అలీ, కార్యదర్శి ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

దరఖాస్తు చేసుకోండి



సూచనలిస్తున్న డీఐఈవో కల్పన

ధర్మారం(ధర్మపురి): ప్రజాపాలన గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని పెద్దపల్లి డీఐఈవో కల్పన కోరారు. బొట్లవనపర్తి, బుచ్చయ్యపల్లి, కటికెనపల్లి, న్యూకొత్తపల్లి, చామనపల్లి గ్రామాల్లో శుక్రవారం ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. కటికెనపల్లి గ్రామసభకు ఇంటర్ విద్య జిల్లా నోడల్ డీఐఈవో కల్పన హాజరయ్యారు. దరఖాస్తులను పరిశీలించిన తర్వాత మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలు కోసం ఏర్పాటు చేసిన గ్రామసభలను ప్రజలు వినియోగించుకుని లబ్ధిపొందాలని సూచించారు. చామనపల్లి, కటికెనపల్లి, న్యూకొత్తపల్లిలోని సభలను మండల ప్రత్యేకాధికారి శ్రీధర్ సందర్శించారు. సభల ఇన్‌చార్జిలు జయశీల, పూర్ణిమ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎన్టీపీసీలో ఆనంద్‌మేళా

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ ఉద్యోగుల వికాసం కోసం స్థానిక జ్యోతిక రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో శనివారం ఆనంద్ మేళా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సదరన్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఛటోపాధ్యాయ హాజరవుతారు. ఆదివారం 2023కు వీడ్కోలు చెబుతూ 2024కు స్వాగతం చెబుతూ బైబై మేళా నిర్వహిస్తారు.

ఆటలు చదివారు

ఆధునిక పోటీ ప్రపంచంలో ఒకేరంగంలో మెరిసి మురిపిస్తే సరిపోదనుకున్నారు.. ఒక్కసారి విజేతగా నిలిస్తే అందులో వింతేముందని భావించారు.. అన్నింటా ముందుండాలని, ఆల్‌రౌండర్‌గా నిలవాలని, చదువుతోపాటు ఆటల్లోనూ రాణిస్తేనే కెరీర్ బాగుంటుందని లక్ష్యంగా పెట్టుకున్నారు.. అంతే.. రంగంలోకి దిగారు.. బరి గీశారు.. లక్ష్యం సాధించారు. జిల్లా, రాష్ట్రమే కాదు.. జాతీయ స్థాయిలోనూ సత్తా చాటారు. 2023లో జిల్లా నుంచి ప్రతిభ చాటిన చిచ్చరపిడుగులపై అవలోకనం. – కోల్‌సిటీ(రామగుండం)

2023 రివైండ్

- బరి గీశారు.. పోటీ పడ్డారు.. సత్తా చాటారు
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించిన జిల్లా క్రీడాకారులు
- కెరీర్‌కు పెద్దపీట వేసుకున్న చిన్నారులు



కరాటే ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థులు



కరాటే ఫైటర్ ఎం.ముక్తిశ్రీ సాధించిన పతకాలు

బంగారు విష్ణువర్ధన్



కరీంనగర్‌లో ఇటీవల జరిగిన జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్‌లో రాష్ట్రస్థాయి–3కే రన్‌లో సత్తాచాటి గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నాడు. 20 రోజుల క్రితం జరిగిన స్టేట్ లెవల్ గురుకులాల సొసైటీ గేమ్స్‌లోనూ ఖోఖోలో గోల్డ్ మెడల్ సాధించాడు. చదువులోనూ ముందున్నాడు. స్కూల్ యాజమాన్యం, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉంది.

– మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకులం, గోదావరిఖని

పరుగుల గణేశ్



గోదావరిఖని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలకు చెందిన గణేశ్‌నాయక్.. ఇటీవల పెద్దపల్లిలో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో పాల్గొన్నాడు. 100 మీటర్ల పరుగు పందంలో ప్రతిభ చూపి గోల్డ్‌మెడల్ సాధించాడు. జాతీయస్థాయిలో వాలీబాల్ పోటీల్లోనూ సత్తా చాటాడు.

కబడ్డీ.. రాంచరణ్



గోదావరిఖని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలకు చెందిన బి.రాంచరణ్ కబడ్డీలో రాణిస్తున్నాడు. ఇటీవల పెద్దపల్లిలో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో ప్రతిభ చూపి అందరినీ మంత్రముగ్ధులను చేశాడు. బెస్ట్‌రైడర్ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించాడు. మధ్యప్రదేశ్‌లో ఇటీవల జరిగిన జాతీయిస్థాయి కబడ్డీ పోటీల్లో బంగారు పతకం కైవసం చేసుకున్నాడు.

ఫైటర్ ముక్తిశ్రీ



గోదావరిఖని జవహర్‌నగర్‌కు చెందిన ఎం.ముక్తిశ్రీ ఏడో తరగతి చదువుతూనే కరాటేలో రాణిస్తోంది. చదువులోనూ మంచిఫలితాలు సాధిస్తున్న ఈ విద్యార్థిని ఇప్పటికే బ్లాక్‌బెల్ట్ పొందింది. స్టేట్ లెవల్ పోటీల్లో 17 గోల్డ్ మెడల్స్, సిల్వర్ మెడల్స్ సాధించింది. నేషనల్ స్థాయిలో 36 గోల్డ్, సిల్వర్ మెడల్స్ సొంతం చేసుకుంది. హైదరాబాద్, న్యూఢిల్లీ, మహారాష్ట్రలో జరిగిన ఇంటర్నేషనల్ టోర్నీలో నాలుగు గోల్డ్ మెడల్స్ సాధించింది. ఉమ్మడి జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్, నల్గొండలో జరిగిన రాష్ట్రస్థాయిలోనూ గోల్డ్ మెడల్స్ కైవసం చేసుకుంది.

చదువుల అమృత



ఎన్టీపీసీకి చెందిన అమృత ఇంటర్ సెకండియర్ చదువుతోపాటు కరాటేలోనూ రాణిస్తోంది. గతేడాది బైపీసీలో కాలేజీ టాపర్‌గా నిలిచింది. స్టేట్ లెవల్ కరాటేలో పోటీల్లో నాలుగు బంగారు పతకాలు, జాతీయస్థాయి పోటీల్లో మరో గోల్డ్ మెడల్, సిల్వర్ మెడల్ కైవసం చేసుకుంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్‌లోనూ బంగారు పతకం సాధించింది.

కిక్ బాక్సింగ్‌లో హవా



గోదావరిఖని మార్కండేయ కాలనీకి చెందిన సిలిగిరి రిస్విక్‌తేజ లింగాపూర్ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్నాడు. కిక్‌బాక్సింగ్, వుషు సండా(ఫైటింగ్)లో పట్టుసాధించాడు. బరిగిస్తే.. పతకం ఖాయం చేసుకుంటున్నాడు. ఇప్పటికే రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో మూడు గోల్డ్ మెడల్స్, ఒక సిల్వర్ మెడల్ సాధించాడు. జాతీయిస్థాయి పోటీల్లో రజత పతకం పొందాడు. గురువుల ప్రోత్సాహం ఉంది.

చిచ్చరపిడుగు సాయివిఘ్నేశ్



గోదావరిఖని ఆర్సీసీ కాలనీకి చెందిన సాయివిఘ్నేశ్ పదో తరగతి చదువుతున్నాడు. కిక్ బాక్సింగ్, వుషు సండా(ఫైటింగ్)లో రాణిస్తున్న ఈ చిచ్చరపిడుగు.. చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తున్నాడు. ఇప్పటివరకు రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్, ఫైటింగ్ పోటీల్లో నాలుగు గోల్డ్ మెడల్స్ సాధించాడు. జాతీయిస్థాయిలో రజత పతకం కైవసం చేసుకున్నాడు.

ఔషధ మొక్కలపై ఆరా

జూలపల్లి(పెద్దపల్లి): స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ టీం సభ్యులు శుక్రవారం పరిశీలించారు. వైద్యసేవలు, రికార్డులు, ఔషధాల నిల్వలు, పారిశుధ్యం నిర్వహణపై ఆరా తీశారు. ఔషధ మొక్కల పెంపకం గురించి వాకబు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు మనీశ్‌కుమార్, ప్రియాంకజైన్, జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్, మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి, సీహెచ్‌వో కలీమొద్దీన్, హెచ్‌వీ వసంత, ఎల్‌టీ కిరణ్, ఏఎన్‌ఎంలు, ఆశలు, సిబ్బంది ఉన్నారు.



మొక్కలు పరిశీలిస్తున్న ప్రతినిధులు

వార్డుసభల మార్పులపై ఫిర్యాదులు

- తలలు పట్టుకుంటున్న అధికారులు



అధికారులను నిలదీస్తున్న కార్పొరేటర్ రజిత

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థలో ప్రజాపాలన వార్డు సభల నిర్వహణ అధికారులకు కొత్త సమస్యలు తెచ్చి పెడుతోంది. కార్పొరేటర్ల ఇళ్ల సమీపం, మండపాలు, పాఠశాలల ఆవరణలో వార్డుసభలు నిర్వహించడాన్ని వ్యతిరేకిస్తూ కొందరు శుక్రవారం కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు తొలుత ప్రకటించిన స్థలాల్లో కాకుండా, మరోచోట వార్డు సభలు నిర్వహిస్తున్నారు. అధికారుల తీరుపై ఆయా డివిజన్లలోని కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం స్థానిక 12వ డివిజన్‌లో ముందుగా చెప్పిన స్థలంలో కాకుండా అదే డివిజన్‌లోని మహిళా భవనం వద్ద సభ నిర్వహించడంతో డివిజన్ కార్పొరేటర్ బొడ్డు రజిత ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థలం మార్చడంపై తనకు ముందుగా ఎందుకు సమాచారం ఇవ్వలేదని, కార్పొరేటర్‌ను ప్రొటోకాల్ కింద పరిగణించడం లేదా? అని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నాగేశ్వర్‌తోపాటు వార్డు సభ నిర్వహిస్తున్న అధికారులను ఆమె నిలదీశారు. కనీసం ఆర్పీలకు కూడా సమాచారం ఇవ్వలేదని, ఇదేం పద్ధని మండిపడ్డారు. కమిషనర్ నచ్చజెప్పడంతో ఆమె శాంతించారు. అలాగే 13వ డివిజన్‌లో కూడా ఇలా జరగడంతో అక్కడి కార్పొరేటర్ కూడా అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో గత్యంతరం లేక అధికారులు రెండు ప్రాంతాల్లో ప్రజాపాలన వార్డు సభలు నిర్వహించాల్సి వచ్చింది.

డంపింగ్ యార్డుకు మళ్లీ కష్టాలు

- వాహనాలను అడ్డుకున్న సుందిళ్ల గ్రామస్తులు
- చెత్త పోయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ప్రజలు
- ఎఫ్‌సీఐ ఫిల్టర్ బెడ్ సమీపంలోకి మళ్లిన చెత్త డంపింగ్



సుందిళ్ల సమీపంలోని డంపింగ్ యార్డు స్థలం

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థ అధికారులు డంపింగ్ యార్డు సమస్యకు పరిష్కారం లభించిందని ఊపిరి పీల్చుకున్నారు. కానీ, వారికి ఊహించని షాక్ తగిలింది. డంపింగ్ యార్డుకు మళ్లీ కష్టాలు వచ్చాయి. కలెక్టర్, అదనపు కలెక్టర్, రామగుండం నగర మేయర్, కమిషనర్, తహసీల్దార్ చొరవతో ఎట్టకేలకు సుందిళ్ల గ్రామ సమీపంలో డంపింగ్ యార్డు వినియోగానికి సింగరేణి సంస్థ ఐదు ఎకరాలు కేటాయించింది. ఈ స్థలాన్ని చదును చేయించిన నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగం అధికారులు.. ఆ స్థలంలోనే ఇంటింటా నుంచి సేకరించిన చెత్త పోస్తున్నారు. అయితే, తమ గ్రామ సమీపంలో చెత్త పోయడాన్ని సుందిళ్ల వాసులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇటీవల డంపింగ్ యార్డుకు వెళ్లిన బల్దియా చెత్త వాహనాలను చెత్త పోయకుండా వారు అడ్డుకున్నారు. మరోసారి చెత్త పోయడానికి వాహనాలను తీసుకొస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కంగుతిన్న అధికారులు.. గత్యంతరం లేక గోదావరి నది సమీపంలోని ఎఫ్‌సీఐ ఫిల్టర్ బెడ్ ప్రాంతంలో తాత్కాలికంగా చెత్త పోస్తున్నారు. డంపింగ్ యార్డుకు పరిష్కారం దొరికిందనుకున్న తరుణంలో గ్రామస్తుల నుంచి వ్యతిరేకత రావడంతో ఏం చేయాలో తోచక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

అడుగుకో గుంత



పెద్దపల్లి – రామగిరి – సెంటినరీకాలనీ మధ్య ప్రధాన రహదారి గుంతలుపడి ప్రయాణం నరకం చూపిస్తోంది. నిత్యం వేలాది ఇసుక లారీలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో చిన్నగుంతలు కాస్త కుంటలుగా మారాయి. అందులోపడుతూ లేస్తూ వాహనాలు ముందుకు కదులుతున్నాయి. వీటి కుదుపులకు వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి సకాలంలో మరమ్మతు చేయాలని వారు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఈ ఏడాది పలు సంచలన సంఘటనలకు వేదికైంది. హత్య, ఆత్మహత్య, మిస్సింగ్, చోరీలు, కాల్పులు, టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ, అవినీతి, అరెస్టు, టీచర్ల బయోమెట్రిక్ దుమ్మా, తిరుపతికి ప్రయాణికుల ఇక్కట్లు.. ఇలా ఏ రకమైన వార్త తీసుకున్నా అది రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. వీటన్నింటిపై 'సాక్షి' దినపత్రిక స్పాట్ వార్తలతో పాటు ప్రత్యేక కథనాలు ప్రచురించింది. స్పందించిన ప్రభుత్వ యంత్రాంగం వెంటవెంటనే చర్యలు తీసుకుంది. పలు శాఖల అధికారుల అవినీతి, అక్రమాలపై ఉన్నతాధికారులు కఠినంగా వ్యవహరించారు. బాధ్యులను విధుల నుంచి తప్పించారు. –సాక్షిప్రతినిధి, కరీంనగర్



అన్నీ సంచలనాలే...

2023 రివైండ్



- చోరీలు.. హత్య.. ఆత్మహత్యలు.. అవినీతి, అక్రమాలు
- 'టీఎస్‌పీఎస్సీ' కేసుకు కరీంనగర్‌కు లింకు
- పదోతరగతి ప్రశ్నాపత్రాల లీకేజీ కేసులో ఎంపీ సంజయ్ అరెస్టు
- రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైన ఉమ్మడి జిల్లా ఘటనలు

జనవరి 1–2023: ఆత్మహత్యలు కావు హత్యలే.. గతేడాది కొత్త సంవత్సరం రోజున గంగాధరలో ఒకే కుటుంబంలో ఇద్దరు పిల్లలు, తల్లి అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ఈ మరణాల గుట్టు నూతన సంవత్సరం రోజునే వీడింది. తండ్రే తన పిల్లలకు, భార్యకు ఎస్ఏఓహెచ్ అనే రసాయనం కలిపి ఇచ్చినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. తొలుత ఈ విషయాన్ని 'సాక్షి' వెల్లడించింది. ఆ తర్వాత నిందితుడు కూడా ఆత్మహత్య చేసుకోవడంతో కేసు మూసివేశారు.

ఫిబ్రవరి 24: కొండగట్టు ఆలయంలో బీదర్ దొంగల చోరీ.. ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆలయంలో బీదర్ నుంచి వచ్చిన దొంగలు చోరీ చేశారు. పలు వెండి ఆభరణాలు, తాపడాలను ఎత్తుకెళ్లారు. పోలీసులు 24 గంటల్లోనే కేసును ఛేదించడం గమనార్హం. ఈ విషయాన్ని కూడా 'సాక్షి' ముందుగానే ఎక్స్‌క్లూజివ్‌గా పాఠకులకు అందించింది.

మార్చి 16: టీచకుడు.. జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ తోటి మహిళా టీచర్లను వేధిస్తున్న వైనాన్ని 'సాక్షి' బయటపెట్టింది. పకడ్బందీగా ఆయన వికృత చేష్టలను లోకానికి చూపించడంతో ఉన్నతాధికారులు విచారణ చేపట్టి, సస్పెన్షన్ వేటు వేశారు.

10లో ▸

క్లుప్తంగా

ఆడిట్ అధికారుల ఔదార్యం



సాయం చేస్తున్న వెంకటేశ్వర్‌రావు

పెద్దపల్లిరూరల్: ఆడిట్ శాఖలో పనిచేస్తున్న పట్టణానికి చెందిన ఈర్ల రాజేశం ఇటీవల అనారోగ్యంతో చనిపోయారు. సహచర అధికారులు, ఉద్యోగులు ఆయన కుటుంబానికి అండగా నిలిచారు. రూ.1.26లక్షలను రాష్ట్ర ఆడిట్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రావు చేతులమీదుగా శుక్రవారం అందించారు. డిప్యూటీ డైరెక్టర్లు రాజ్‌కుమార్, వేణుమాధవ్‌రెడ్డి, జిల్లా అధికారి రవిబాబు, ఉద్యోగులు ఉన్నారు.

పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి.. వృద్ధుడి హఠాన్మరణం

సుల్తానాబాద్‌రూరల్: పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన రైతు కొత్తూరి లక్ష్మయ్య(67) అక్కడే కుప్పకూలి చనిపోయాడు. ఎస్సై విజేందర్, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం సుగ్లాంపల్లికి చెందిన లక్ష్మయ్య శుక్రవారం ఉదయం పొలం వద్దకు వెళ్లాడు. యాసంగి కోసం పోసిన వరి నారుమడికి నీరు పెట్టాడు. కాసేపటికి అక్కడే కుప్పకూలిపోయాడు. సమీపంలోని రైతులు వచ్చి చూసేసరికి మృతి చెంది కనిపించాడు. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉంది. మృతుడి భార్య రాజమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

35 అంశాలకు ఏకగ్రీవ తీర్మానం



సంబురాలు చేసుకుంటున్న పాలకవర్గం

పెద్దపల్లిరూరల్: మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి అధ్యక్షతన శుక్రవారం స్థానిక పురపాలక కార్యాలయంలో సాధారణ సమావేశం జరిగింది. ఈసందర్భంగా 35అంశాలకు సంబంధించిన బిల్లులకు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. దీంతో ఆయా అంశాలకు సంబంధించిన బిల్లులు ఏకగ్రీవంగా ఆమోదం పొందాయని కమిషనర్ వెంకటేశ్, మేనేజర్ శివప్రసాద్ తెలిపారు. సమావేశంలో పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

ముందస్తు వేడుకలు..

కార్యాలయ ఆవరణలో ముందస్తుగా నూతన సంవత్సర వేడుకలను నిర్వహించుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి కేక్ కట్ చేసి హ్యాపీ న్యూ ఈయర్ శుభాకాంక్షలు తెలిపారు. అందరికీ మిఠాయిలు తినిపించారు. ఈ వేడుకల్లో కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

రామగుండం: స్థానిక రైల్వేస్టేషన్‌లో చేపట్టిన అమృత్ భారత్ అభివృద్ధి పనులను సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ భరత్‌కుమార్ జైన్ శుక్రవారం పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. ప్రయాణికులకు ఆటంకం కలుగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాగా, శిథిలావస్థకు చేరిన రైల్వే క్వార్టర్లను పునరుద్ధరించాలని, రైల్వే కాలనీలో ఏసీ కమ్యూనిటీ హాల్ నిర్మించాలని, కార్మికులకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలని, ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయాలని, మహిళా ఉద్యోగులకు ప్రత్యేక వాష్‌రూమ్‌లు నిర్మించాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రతినిధులు డీఆర్‌ఎంకు వినతిపత్రం అందజేశారు. యూనియన్ ప్రతినిధులు మెట్ట రామారావు, ఓవై స్వామి, వీరన్న, రాజ్‌కుమార్, రజనీకాంత్, అరవింద్, మోజెస్, ఆనంద్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నీ సంచలనాలే...

సాక్షి ప్రతినిధి, కరీంనగర్


'కట్టా'ను పట్టుకున్నాం!


దళితబంధులో అవినీతి జాడలు!

మార్చి 18: టీఎస్‌పీఎస్సీ కలకలం.. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీలో ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజశేఖర్‌రెడ్డిది జగిత్యాల జిల్లానే. దీంతో సిట్ బృందం పలుమార్లు జిల్లాకు వచ్చి విచారణ చేపట్టింది. కరీంనగర్ జిల్లా బొమ్మకల్‌లోనూ లీకేజీకి లింకుందని గుర్తించారు. ఆ తర్వాత ఓ ప్రముఖ కాలేజీలో పనిచేసే సిబ్బందిని కూడా ఈ కేసులో అరెస్టు చేశారు.

ఫిబ్రవరి 03–2023: తల్లీపిల్లలను కలిపిన సాక్షి.. కరీంనగర్ మంకమ్మతోట నుంచి ఓ మహిళ ఇద్దరు పిల్లలను కిడ్నాప్ చేసి, మహారాష్ట్ర తీసుకెళ్లింది. ఈ విషయాన్ని 'సాక్షి' వెలుగులోకి తీసుకువచ్చింది. దీంతో పోలీసులు ఆ పిల్లలను తల్లిదండ్రులకు అప్పగించి, నిందితురాలిపై కేసు నమోదు చేశారు.

మార్చి 15: 'కట్టా'ను పట్టుకున్న సాక్షి.. నకిలీ అర్హతలతో 34 ఏళ్లుగా పంచాయతీరాజ్ శాఖలో కొలువు చేస్తున్న కట్టా విష్ణువర్ధన్ అనే ఉద్యోగి నిర్వాకంపై 'సాక్షి' వరుస పరిశోధన కథనాలు వెలువరించింది. ఉన్నతాధికారులు స్పందించి, అక్రమాలు నిజమేనని తేల్చారు. అనంతరం సస్పెన్షన్ వేటు వేశారు.

ఏప్రిల్ 1: పోలీసులకు శాశ్వత ఫోన్ నంబర్.. పోలీసులందరికీ ఒకే శాశ్వత నంబర్‌ను కేటాయిస్తూ పోలీసు శాఖ నిర్ణయం తీసుకుంది. ఈ విధానాన్ని కరీంనగర్ నుంచే అమలుకు నిర్ణయించింది. డిపార్ట్‌మెంట్‌లో చేరిన వ్యక్తి రిటైరయ్యే వరకు ఒకే నంబర్ ఉంటుంది. దాన్నే పీఎఫ్, బ్యాంకు ఖాతాలకు అనుసంధానిస్తారు.

ఏప్రిల్ 4: బండి సంజయ్ అరెస్టు.. పదోతరగతి ప్రశ్నాపత్రాల లీకేజీ కేసులో ఎంపీ బండి సంజయ్‌ను కరీంనగర్ పోలీసులు అర్ధరాత్రి అరెస్టు చేసి, హనుమకొండకు తరలించారు. ఈ సందర్భంగా జరిగిన తోపులాటలో ఎంపీ సెల్‌ఫోన్ పోయింది. ఇంతవరకూ దొరకలేదు.

ఏప్రిల్ 20: మానకొండూర్‌లో కాల్పుల కలకలం.. మానకొండూర్ మండల కేంద్రంలో కాల్పులు జరిగాయన్న వార్త కలకలం రేపింది. అరుణ్ అనే యువకుడిపై గోదావరిఖనికి చెందిన సాయితేజ్, అతని మిత్రులు కలిసి హత్యాయత్నం చేశారు. నాటు తుపాకీతో కాల్చగా అది పేలలేదు. పోలీసులు ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకొని, నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

మే 24: నా కోడిని చంపేశారు.. తన టర్కీ కోడిని పొరుగింటి వ్యక్తి చంపాడంటూ ఓ వ్యక్తి కరీంనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం, ఈ వార్త 'సాక్షి'లో ప్రముఖంగా ప్రచురించడం చర్చనీయాంశమైంది. సోషల్ మీడియాలోనూ వైరల్‌గా మారింది.

జూన్ 27: ఉగ్రకేసులో తండ్రీకూతుళ్ల అరెస్టు.. ఉగ్రవాదులతో సంబంధాలున్నాయన్న ఆరోపణలతో రామగుండంలో తలదాచుకున్న ఓ తండ్రీకూతుళ్లను ఏటీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. శ్రీనగర్‌కి చెందిన ఇస్లామిక్ స్టేట్ సానుభూతిపరులతో చాటింగ్ చేసినట్లు గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. తండ్రి గతంలో హైదరాబాద్‌లో జరిగిన ఓ పేలుళ్ల కేసులో నిందితుడిగా ఉన్నాడని సమాచారం.

ఆగస్టు 14: బాలిక మృతి కేసులో కొత్త ట్విస్ట్.. పెద్దపల్లి శివారులో నివసించే మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ బాలిక గాయపడి, అనుమానాస్పద స్థితిలో మరణించడం కలకలం రేపింది. ఆమెపై సామూహిక లైంగిక దాడి జరిగిందన్న ఆరోపణలు వచ్చినా.. దర్యాప్తులో ఆత్మహత్య చేసుకుందని తెలియడంతో కేసు మిస్టరీ వీడింది.

జనవరి 05: సరసమైన ధరలకే విరాసత్.. గంగాధర మండల తహసీల్దార్ కార్యాలయంలో వారసత్వ భూములు విరాసత్ చేసే విషయంలో ఫోన్ పే ద్వారా రూ.లక్షల లంచాలు తీసుకున్నారు. అయినా పని చేయకపోవడంతో బాధితులు 'సాక్షి'ని ఆశ్రయించారు. ఈ వ్యవహారాన్ని వెలుగులోకి తీసుకురావడంతో విచారణ జరిపిన కలెక్టర్ కార్యాలయం తహసీల్దార్‌ను బదిలీ చేసి, వీఆర్‌ఏ, వీఆర్వోలను సస్పెండ్ చేసింది.

జనవరి 21: పల్లెల్లో సహారా కలకలం.. అధిక వడ్డీ రేట్ల ఆశచూపి, డిపాజిట్లు సేకరించిన సహారా సంస్థ కస్టమర్లకు డబ్బులు తిరిగి చెల్లించడం లేదు. ఈ విషయం గోప్యంగా ఉంచి వారిని మభ్యపెడుతూ వస్తున్నారు. ఈ కుంభకోణం 'సాక్షి' పరిశోధనాత్మక కథనంతో వెలుగుచూసింది. డీజీపీ కార్యాలయం ఆదేశాలతో రంగంలోకి దిగిన పోలీసులు ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోపాటు రాష్ట్రంలో పలుచోట్ల కేసులు నమోదు చేసి, పలు కీలక దస్త్రాలు స్వాధీనం చేసుకున్నారు.

జూలై 03: దళితబంధులో మామూళ్ల పర్వం.. దళితబంధు పథకంలో మామూళ్ల పర్వంపై 'సాక్షి'లో ప్రచురితమైంది. దీనిపై విచారణ జరిపిన ఉన్నతాధికారులు ఓ ఉద్యోగిని సస్పెండ్ చేశారు. మరో ఉద్యోగి సస్పెన్షన్ భయంతో లీవు మీద వెళ్లారు.

జూలై 04: దుమ్మా మాస్టార్లు.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టీచర్లు బయోమెట్రిక్ ఉన్నా దుమ్మా కొడుతున్న వైనాన్ని 'సాక్షి' దుమ్మా మాస్టార్లు పేరిట కథనం ప్రచురించింది. దీనికి కరీంనగర్ డీఈవో స్పందించి, ఆలస్యమైతే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

సెప్టెంబర్ 08: రైతుబీమా ఐడీలలో జాప్యం.. రైతుబీమా, ఎల్‌ఐసీ ప్రీమియం పొందాలంటే ఐడీలు తప్పనిసరి. కానీ, ఈ–జెనరేట్ కాక పలువురు మరణించిన రైతుల కుటుంబాలకు బీమా జాప్యమైంది. విషయాన్ని 'సాక్షి' వెలుగులోకి తీసుకురావడంతో స్పందించిన వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు సమస్యను పరిష్కరించారు.

సెప్టెంబరు 20: స్పౌజ్ కోటా దుర్వినియోగం.. దంపతులిద్దరూ ప్రభుత్వ టీచర్లయితే ఒకేచోట పని చేసేందుకు ఉద్దేశించిన స్పౌజ్ కోటాను పలువురు టీచర్లు కేవలం హెచ్‌ఆర్‌ఏ కోసం దుర్వినియోగం చేశారు. ఈ విషయాన్ని 'సాక్షి' ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా.. స్పందించిన విద్యాశాఖ వారిపై చర్యలు చేపట్టింది.

సెప్టెంబర్ 29: తప్పుడు ర్యాంకులతో పదోన్నతులు.. పదోన్నతులు, బదిలీల్లో టీచర్లు ర్యాంకులను తప్పుగా చూపించారు. 317 జీవో సమయంలో ఒకలా, ఇప్పుడు మరోలా చూపించిన వైనాన్ని 'సాక్షి' బట్టబయలు చేసింది. దీంతో స్పందించిన విద్యాశాఖ తప్పుడు ర్యాంకులతో పదోన్నతులు, బదిలీ చేయించుకున్న వారిపై చర్యలు చేపట్టింది.

అక్టోబర్ 31: కలెక్టర్ నివాసంలో చోరీ.. అక్టోబర్ 30న రాత్రి కరీంనగర్ కలెక్టర్ బి.గోపి నివాసంలో ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా కంకిపాడు మండలం ఉప్పులూరుకు చెందిన పగిడిపల్లి ప్రసాద్ చొరబడ్డాడు. కలెక్టర్‌కు సంబంధించిన ల్యాప్‌టాప్, చార్జర్, బ్యాగు, పెన్‌డ్రైవ్‌ను ఎత్తుకెళ్లాడు. పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. నవంబర్ 07న అతన్ని అరెస్టు చేసి, కోర్టుకు తరలించారు.

జూలై19: పోలింగ్ కేంద్రాల సమస్యలపై జూలైలో 'సాక్షి' వరుస కథనాలు ప్రచురించింది. స్పందించిన ఉన్నతాధికారులు తప్పులను సరిదిద్దారు. డిసెంబర్‌లో కొత్తపోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు.

డిసెంబర్ 22: తిరుపతికి ఇక వారానికి నాలుగు రైళ్లు.. కరీంనగర్ నుంచి తిరుపతికి వారానికి రెండుసార్లు ఉన్న బైవీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను ఇకపై నాలుగుసార్లు నడపాలని కేంద్రం నిర్ణయించింది. ప్రయాణికుల ఇక్కట్లపై 'సాక్షి' వరుస కథనాలకు స్పందించిన ఎంపీ బండి సంజయ్ సర్వీసుల సంఖ్య పెంచుతానని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు.

డిసెంబర్ 27: ఎల్‌పీసీ సమర్పించాలి.. లాస్ట్ పేమెంట్ సర్టిఫికెట్ (ఎల్‌పీసీ) సమర్పించకుండానే పలువురు ఇంజినీర్లు కరీంనగర్‌లో ఉద్యోగం చేస్తున్న వైనంపై 'సాక్షి' ప్రచురించిన కథనానికి నగరపాలక కమిషనర్ స్పందించారు. అధికారులందరూ వెంటనే ఎల్‌పీసీ సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు.

క్యాట్‌ఫిష్ కోసమేనా..?

- వివాదాస్పదమైన చికెన్ వ్యర్థాల తరలింపు
- అక్రమంగా రవాణా
- అడ్డుకున్న అధికారులు
- రెండు వర్గాల మధ్య వాగ్వాదం
- బహిర్గతమైన బాగోతం



బల్దియా కార్యాలయంలో నిలిపిన వాహనం

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో చికెన్ వ్యర్థాల తరలింపు వ్యవహారం వివాదాస్పదంగా మారింది. అనుమతి లేనిఓ వ్యక్తి వాహనాల్లో ప్రతీరోజు వ్యర్థాలు తరలిస్తుండడంపై బల్దియా అధికారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అయినా బహిరంగానే అక్రమంగా తరలిస్తున్నారు. దీనిపై చికెన్ వ్యర్థాలను తరలించడానికి టెండరు పొందిన కరీంనగర్‌కు చెందిన వారాహి ఆగ్రోవెట్ అనే సంస్థ ప్రతినిధులు శుక్రవారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో అక్రమంగా చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న సదరు వాహనాన్ని పారిశుద్ధ్య విభాగం అధికారులు అడ్డుకొని బల్దియా కార్యాలయానికి తరలించారు. కాగా, అక్రమంగా తరలించడం లేదని, తనకే తరలించే హక్కు ఉందని వ్యర్థాలను తరలిస్తున్న వ్యక్తులు పారిశుద్ధ్య విభాగం సిబ్బందితో వాగ్వాదానికి దిగినట్లు తెలిసింది.

టెండరు పొందిన ఏజెన్సీకి ఇవ్వని వ్యర్థాలు..

- రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని సుమారు 139 చికెన్ దుకాణాల నుంచి ప్రతీరోజు వ్యర్థాలను తరించడానికి బల్దియా నుంచి కరీంనగర్‌కు చెందిన వారాహి ఆగ్రోవెట్ అనే సంస్థ 2025 వరకు అనుమతి పొందింది.
- ఇందుకోసం ఒక్కో దుకాణానికి రూ.1,400 చొప్పున రూ.1,94,600 మొత్తాన్ని సదరు కాంట్రాక్టు ఏజెన్సీ బల్దియాకు చెల్లించింది.
- గత నెలలోనే వారాహి ఆగ్రోవెట్ సంస్థకు కార్పొరేషన్ కమిషనర్ అనుమతి కూడా ఇచ్చారు.
- కానీ ఈ సంస్థకు చికెన్ వ్యర్థాలను ఇవ్వకుండా మరో వ్యక్తి అడ్డుపడుతుండడం వివాదాస్పదంగా మారింది.
- దీంతో డిపాజిట్ చెల్లించిన బాధిత కాంట్రాక్టు ఏజెన్సీ సంస్థ ప్రతినిధులు అయోమయానికి గురవుతున్నారు.

క్యాట్ ఫిష్‌ల పెంపకం కోసమా?

నగరపాలక సంస్థ అనుమతి లేకుండా తరలిస్తున్న చికెన్ వ్యర్థాలను నిషేధిత క్యాట్‌ఫిష్‌ల పెంపకం కోసమేనా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో కూడా ఇదే తరహాలో ఓ ముఠా బహిరంగా చికెన్ వ్యర్థాలను ప్రత్యేక వాహనాల్లో తరలించింది. దీనిపై అప్పుడు ×సాక్షి॥ వరుస కథనాలు ప్రచురించడంతో అప్పటి పోలీసు కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి ప్రత్యేక పోలీసు సిబ్బందితో నిఘా పెట్టారు. తాజాగా మరోసారి చికెన్ వ్యర్థాల తరలింపు వివాదం బహిర్గతం కావడంతో దీనిపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

తరలింపును అడ్డుకున్నాం



చికెన్ వ్యర్థాలను అనుమతి లేకుండా తరలిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. శానిటేషన్ సిబ్బందితో తరలింపును అడ్డుకొని వాహనాన్ని బల్దియా కార్యాలయంలో తరలించాం. సదరు వ్యక్తి రూ.లక్ష టెండర్‌కు కేవలం రూ.10 వేలు మాత్రమే చెల్లించాడు. ఆయనకు ఇచ్చిన గడువు కూడా ముగిసింది. కొత్తగా కరీంనగర్‌కు చెందిన వారాహి ఆగ్రోవెట్‌కు టెండరు ఇచ్చాం. వారు రూ.2లక్షల వరకు డిపాజిట్ చెల్లించారు. వారికే చికెన్ వ్యర్థాలు తరలించే హక్కు ఉంటుంది.

– నాగేశ్వర్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, రామగుండం

అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ధ్వజం
- 'ఖని'లో బీఆర్‌ఎస్ జిల్లా ముఖ్య నేతల సమావేశం



మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

గోదావరిఖని: బీఆర్‌ఎస్ సర్కార్‌పై పచ్చి అబద్ధాలు ప్రచారం చేసి కాంగ్రెస్ అధికారంలో వచ్చిందని, ఆరుగ్యారెంటీలను అమలు చేసేదాకా వదిలేదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక తిలక్‌నగర్ విశ్వం కమ్యూనిటీ హాల్‌లో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముఖ్యనాయకులు సమావేశంలో వారు మాట్లాడారు. కేసీఆర్ పాలనలో దేశంలో ఎక్కడలేని సంక్షేమం జరిగిందని, ప్రజాస్వామ్యంలో గెలుపు, ఓటములు సహజమన్నారు. పదవుల కోసం పనిచేసేవాళ్లం తాము కాదన్నారు. పదవి ఉన్నా, లేకున్నా ప్రజలకోసమే పనిచేస్తామన్నారు. సింగరేణి కార్మికులకు కేసీఆర్ అనేక సౌకర్యాలు కల్పించారని గుర్తుచేశారు. కాంగ్రెస్ తప్పుడు ప్రచారాలతో గెలిచిందన్నారు. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అలుపెరగని పోరాటం చేశామన్నారు. పెద్దపల్లి ఎంపీగా కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించుకుందామని అన్నారు. శ్రేణుల కోసం పార్టీ కార్యాలయంలో రోజూ సాయంత్రం 5 నుంచి రాత్రి 7గంటల వరకు అందుబాటులో ఉంటామని అన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ అముల నారాయణ, కార్పొరేటర్లు పెంట రాజేశ్, సాగంటి శంకర్, కొమ్ము వేణుగోపాల్, దొంత శ్రీనివాస్, పాముకుంట్ల భాస్కర్, కల్వచర్ల కృష్ణవేణి, దాతు శ్రీనివాస్, ముదాం శ్రీనివాస్, బాదే అంజలి, జనగామ కవిత, సరోజని పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

ఉపాధి కోర్సుల్లో రాణించాలి



కోర్సులు ప్రారంభిస్తున్న జీఎం సూర్యనారాయణ

- ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ

గోదావరిఖని: స్వయం ఉపాధి కోర్సుల్లో మహిళలు రాణించాలని ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ సూచించారు. శుక్రవారం యైటింక్లయిన్‌కాలనీ సీఈఆర్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 2023–24గాను టైలరింగ్, మగ్గం, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్ కోర్సులను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సంస్థ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంతాల ప్రజల అభున్నతి కోసం సింగరేణి అనేక నిధులు వెచ్చిస్తోందన్నారు. ప్రతీఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక లబ్ధిపొంది సొంతంగా వ్యాపారం చేసేస్థాయికి ఎదగాలన్నారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శనను ఆయన తిలకించారు. కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్) రాజేంద్రప్రసాద్, డీవైపీఎం వేణుగోపాల్, సేవా కో ఆర్డినేటర్ బి.దేవరెడ్డి, సేవా సభ్యులు, ఫ్యాకల్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ జోక్యం నియంత్రిస్తాం

- ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్



మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని: సింగరేణిలో రాజకీయ జోక్యం లేకుండా చూస్తామని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నుంచి సింగరేణికి రావాల్సిన బకాయిలను ఇప్పిస్తామని, ఆరు గ్యారెంటీల అమలు కోసం కృషి చేస్తామన్నారు. ఆరు ఏరియాల్లో తమ యూనియన్‌ను గెలిపించిన కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు. వెయ్యి ఓట్ల తేడాతో ప్రాతినిధ్య సంఘంగా ఓడిపోవడానికి గల కారణాలపై సమీక్షిస్తామని, భవిష్యత్‌లో సంస్థ పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధనే ధ్యేయంగా మొక్కవోని దీక్షతో పనిచేస్తామని అన్నారు. ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వంతో పోరాడి అమలుకు కృషి చేస్తామన్నారు. పదేళ్ల అధికారం లేకున్నా వెన్నంటి నిలిచి ఐఎన్‌టీయూసీ జెండా మోసిన ప్రతీకార్యకర్త, నాయకుడికి వెన్నంటి ఉంటామని భరోసా ఇచ్చారు. నాయకులు నర్సింహారెడ్డి, ధర్మపురి, సదానందం, వికాస్‌కుమార్ యాదవ్, కోట రవీందర్‌రెడ్డి, దేవులపల్లి రాజేందర్, ఎట్టం కృష్ణ, మల్లికార్జున్, బేబీ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇది సింగరేణి కార్మికుల విజయమే..

- ఏఐటీయూసీ నేత రవీందర్



మాట్లాడుతున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీ గెలుపు కార్మికుల విజయమని ఆ యూనియన్ ఆర్జీ–2 బ్రాంచ్ కార్యదర్శి జిగురు రవీందర్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఐటీయూసీ కార్మికులకు అండగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తుందన్న నమ్మకంతోనే గెలిపించారన్నారు. వారి నమ్మకాన్ని తప్పకుండా నేరవేరుస్తామని పేర్కొన్నారు. ఓటు వేసి గెలిపించిన కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు. ఏఐటీయూసీ మేనిఫెస్టోలోని హామీలను అమలు చేస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు ప్రకాశ్, రాజారత్నం, అన్నారావు, బుర్ర తిరుపతి, కొండ్ర సత్యనారాయణ, రాజసాగర్, నాగరాజు, భూమయ్య, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒంటరిగా పోరాడి ఓడిన జాతీయ సంఘాలు

- దక్కని 'గుర్తింపు' హోదా
- హెచ్‌ఎంఎస్‌కు తగ్గి.. బీఎంఎస్‌కు పెరిగిన ఓట్లు



సాధించిన ఓట్లు

యూనియన్	2017	2023
బీఎంఎస్	246	917
హెచ్ఎంఎస్	3,910	947

గోదావరిఖని: సింగరేణిలో ఇటీవల నిర్వహించిన గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసిన రెండు జాతీయ సంఘాలు కార్మికుల మన్ననలు పొందలేకపోయాయి. సింగరేణి వ్యాప్తంగా ఈరెండు యూనియన్లు మూడు డిజిట్ల ఓట్లకే పరిమితమైయ్యాయి. మొత్తం 11 ఏరియాల్లో పోటీ చేసిన బీఎంఎస్.. కార్పొరేట్, భూపాల్‌పల్లిలో ఎక్కువ ఓట్లను సాధించింది. ఇల్లెందు, మణుగూరు, బెల్లంపల్లి ఏరియాల్లో సింగిల్ డిజిట్‌కే పరిమితమైంది. ఈసారి కార్మికుల సమస్యలపై ముందుండి పోరాటం చేసింది. జాతీయ స్థాయిలో కార్మికుల సమస్యలపై పట్టు ఉండటంతోపాటు బీజేపీకి అనుబంధంగా ఉన్న ఈయూనియన్ ఈసారి కార్మికుల మద్దతు కూడగట్టలేక పోయిందని భావిస్తున్నారు. అయినప్పటికీ గత ఎన్నికల్లో 241ఓట్లు సాధించగా, ఈసారి ఎన్నికల్లో 917 ఓట్లు సాధించి మూడు రెట్ల ఓటుబ్యాంకును పెంచుకుందని అంటున్నారు.

హెచ్‌ఎంఎస్‌కు తగ్గిన ఓటు బ్యాంకు

ఈసారి గుర్తింపు సంఘం ఎన్నికల్లో హెచ్ంఎస్‌కు ఓటింగ్ శాతం భారీగా తగ్గింది. గత ఎన్నికల్లో యూనియన్ 3,910ఓట్లు సాధించి మూడోస్థానంలో నిలవగా, ఈసారి జరిగిన ఎన్నికల్లో ఐదో స్థానంలో నిలిచింది. కార్పొరేట్, ఇల్లెందు ఏరియాల్లో సింగిల్ డిజిట్ ఓట్లు రావడంతో ఈసారి పూర్తి ఓటింగ్‌పై ప్రభావం చూపింది. కార్మికుల కోసం అహర్నిశలు శ్రమిస్తున్న హెచ్‌ఎంఎస్.. ఓట్లు తగ్గిపోవడంపై బేరీజు వేసుకుంటోంది రాబోయే రోజుల్లో కార్మికుల సమస్యలే పరిష్కార లక్ష్యంగా ముందుకు సాగాలని యోచిస్తోంది.

సీహెచ్‌పీని సందర్శించిన రైల్వే ఉన్నతాధికారులు



బంకర్ పరిశీలిస్తున్న అధికారులు

గోదావరిఖని: రైల్వే డివిజనల్ మేనేజర్ భరతేశ్ కుమార్ జైన్ శుక్రవారం ఓసీపీ–3 సీహెచ్‌పీని సందర్శించారు. సీహెచ్‌పీ ద్వారా రైల్వే శాఖకు బొగ్గు అందిస్తున్న తీరు పరిశీలించారు. రైల్వేట్రాక్, ఎరెక్షన్ లొకేషన్, కొత్త సైలో బంకర్ సైట్ క్లియరెన్స్ కోసం ఆయన ఈ పర్యటన చేపట్టారు. నిర్మాణంలో ఉన్న సైలో బంకర్ పనులు, పూర్తయ్యే సమయం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. వ్యాగన్ కదలికలపై శ్రద్ధ వహించాలని, రక్షణతో పనులు చేయాలని సూచించారు. క్వారీ నుంచి బొగ్గు రవాణా, ఉత్పత్తి, భవిష్యత్ ప్రణాళికల గురించి ఆయన ఆరా తీశారు. రైల్వే ఉన్నతాధికారులు సురేశ్‌రెడ్డి, సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ బస్వరాజ్, ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ, ఏరియా ఇంజినీర్ నరసింహారావు, డీజీఎం(సివిల్) ధనుంజయ, సీహెచ్‌పీ ఇన్‌చార్జి సదానందం పాల్గొన్నారు.

ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలి

- ఆరోగ్యాధికారి ఎన్.సుమన్

గోదావరిఖని: కరోనా కొత్త వేరియంట్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సింగరేణి ఆర్జీ–1 ఆరోగ్యాధికారి ఎన్.సుమన్ సూచించారు. శుక్రవారం జీడీకే–5 ఓసీపీలో కార్మికులకు కరోనాపై అవగాహన కల్పించారు. కరోనా కొత్త వేరియంట్ తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. దానినుంచి రక్షణ పొందేందుకు మాస్క్ ధరించడంతోపాటు భౌతిక దూరం పాటించాలని, ఇతర జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ అనిల్‌గబాలే, సేఫ్టీ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, వెల్ఫేర్ ఆఫీసర్ ఫిరోజ్‌ఖాన్ పాల్గొన్నారు.